
సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 20 । జూన్ । 2025



అప్రమత్తతే రక్ష..
వర్షాకాలంలో ప్రజలు, రైతులు విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండకపోవడంతో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు.
- 10లో ▸



ఫిర్యాదుదారులతో..
ఫిర్యాదుదారులతో బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజలకు మరింత చేరువకావాలని ఎస్పీ ఎం.రాజేశ్‌చంద్ర అన్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.7 /24.6

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

చదువులో రాణించాలి

- బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్



కామారెడ్డి క్రైం: చదువులో రాణించి ఉన్నత స్థానాల్లో నిలవాలని బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్ విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న బాలసదనం, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లను గురువారం ఆమె సందర్శించారు. పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగకుండా చూడాలన్నారు. అనంతరం ఆమె కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె వెంట జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ స్వర్ణలత, డీసీపీవో స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన మాట తప్పను

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



భిక్కనూరు: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం తప్ప.. మాట తప్పే వ్యక్తిని కానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జంగంపల్లి, అంతంపల్లి, లక్ష్మీదేవినిపల్లి, కాచాపూర్ గ్రామాలలో పలు కుల సంఘాల వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా కుల సంఘాల వద్ద తన సొంత డబ్బులతో అభివృద్ధి పనులు చేయించానన్నారు. అన్ని కుల సంఘాల సభ్యులు ఐక్యంగా ఉండి సంఘాలను అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి తిరుమలేశ్, నాయకులు, కార్యకర్తలు ఆయా కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

యోగా చేయండి ఆరోగ్యంగా ఉండండి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి



బాన్సువాడ : ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యంగా జీవించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా టీచర్ ఓట్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాన్సువాడ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ ఉద్యోగులతో యోగా సాధన చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి కాలంలో ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని, శారీరక, మానసిన ఆరోగ్యానికి యోగా చాల ఉపయోగపడుతుందని అన్నారు. ఈ నెల 21న అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న యోగా దినోత్సవానికి అందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, డీఎల్‌పీవో సత్యనారాయణ, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.


ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాలకు బారులు



కామారెడ్డి అర్బన్: డిగ్రీ కోర్సుల ప్రవేశాల కోసం 'దోస్త్' ప్రక్రియ గురువారం చివరి రోజు కావడంతో రిజిస్ట్రేషన్ కోసం విద్యార్థులు బారుల తీరారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విన్నూత కోర్సులుండగా ప్రవేశాల కోసం విద్యార్థులు బారులు తీరారు. తొలి ప్రాధాన్యతగా తమ కళాశాలను ఎంపిక చేసుకోవడంపై ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ హర్షం వ్యక్తంచేశారు.

'దోస్త్' గడువు పొడిగింపు..
డిగ్రీ ప్రవేశాల కోసం 'దోస్త్' గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు జిల్లా సమన్వయకర్త, కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కే విజయ్‌కుమార్ తెలిపారు. దోస్త్‌లో ఎంపికలు ఇవ్వని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అతివ అసెంబ్లీకి పక్కా..!



అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టనున్న నేపథ్యంలో మహిళా ఓటర్ల సంఖ్యపై జోరుగా చర్చ సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో అతివలు అసెంబ్లీకి వెళ్లడం పక్కా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా మహిళా ఓటర్లు
- ఇతర జిల్లాలతో పోలిస్తే ఇక్కడే అధికం
- ప్రతి సెగ్మెంట్‌లో వారి సంఖ్యే ఎక్కువ..
- చట్టసభలోకి వెళ్లనున్న మహిళలు
- నియోజకవర్గాల పునర్విభజనతో మారనున్న ముఖచిత్రం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనివిధంగా నిజామాబాద్ జిల్లా నుంచి తదుపరి శాసనసభలోకి మహిళా ఎమ్మెల్యేలు ఎక్కువమంది అడుగు పెట్టే అవకాశం ఉంది. రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సి ఉన్నప్పటికీ కొన్ని కారణాలతో ఆలస్యమైంది. అయితే 2027లో దేశవ్యాప్తంగా జనాభా లెక్కల అనంతరం రాష్ట్ర శాసనసభ స్థానాల పునర్విభజన చేపట్టడం ఖాయమైంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన ఉండనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండు వరకు అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం ఉన్న 119 నియోజకవర్గాల సంఖ్య 153కు పెరగనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలున్నాయి. రాష్ట్రంలో ఒక్కో లోక్‌సభ స్థానం పరిధిలో ప్రస్తుతం 7 చొప్పున ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్లు 9కి పెరగనున్నాయి. అయితే ఉమ్మడి జిల్లాలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో మహిళల జనాభా, ఓట్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. రానున్న జనాభా లెక్కింపుతో పాటు ఓట్ల సంఖ్యలోనూ మహిళల ఓట్ల సంఖ్య మరింతగా పెరగనుంది.

ఇతర జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే మహిళల ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉంటూ వస్తోంది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందడంతోపాటు రాష్ట్రపతి ముద్ర వేశారు. దీంతో తెలంగాణలో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య 50గా ఉండనుంది. ఇతర ఉమ్మడి జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచే మహిళా ఎమ్మెల్యేలు ఎక్కువగా శాసనసభలోకి అడుగు పెట్టనున్నారు. ఇదిలా ఉండగా లోక్‌సభ సీట్ల పెంపు అంశంపై ఇప్పటివరకు ఒక స్పష్టత రాలేదు. లోక్‌సభ సీట్ల విషయమై దక్షిణాదికి అన్యాయం చేయొద్దనే వాదన నడుస్తున్న నేపథ్యంలో పెంచుతారా లేదా అనేది నిర్ణయం కాలేదు.

గత లోక్‌సభ ఎన్నికల్లో అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆర్మూర్	98,116	1,12,612	06	2,10,734
బోధన్	1,05,609	1,15,701	04	2,21,314
నిజామాబాద్ అర్బన్	1,44,645	1,54,961	41	2,99,647
నిజామాబాద్ రూరల్	1,18,607	1,35,523	06	2,54,136
బాల్కొండ	1,03,995	1,21,263	02	2,25,260
జుక్కల్	99,524	1,03,498	09	2,03,031
ఎల్లారెడ్డి	1,06,881	1,16,423	02	2,23,306
కామారెడ్డి	1,22,474	1,32,682	19	2,55,175
బాన్సువాడ	93,762	1,03,250	13	1,97,025
జగిత్యాల	1,12,554	1,22,198	25	2,34,777
కోరుట్ల	1,15,932	1,28,153	04	2,44,089

రాచమార్గంగా ఉమ్మడి జిల్లా సెగ్మెంట్లు!

ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ మహబూబ్‌నగర్ తదితర ఉమ్మడి జిల్లాల్లో ఎస్టీ జనాభా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆయా గిరిజన రిజర్వ్‌డ్ సీట్లు ఎక్కువగా కేటాయింపు అవుతుంది. మరికొన్ని జిల్లాల్లో ఎస్సీ రిజర్వ్ సీట్లు కచ్చితంగా ఇవ్వాల్సిన పరిస్థితి. అయితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో ఉన్న మొత్తం 11 శాసనసభ సెగ్మెంట్లకుగాను జుక్కల్ అసెంబ్లీ సీటు మినహా 10 స్థానాలు జనరల్‌గానే ఉన్నాయి. అయితే ఈ 11 శాసనసభ సెగ్మెంట్లలో అన్ని స్థానాల్లోనూ మహిళా ఓటర్లే అత్యధికంగా ఉండడం ప్రత్యేకం. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి మహిళా ఎమ్మెల్యేల ప్రాతినిథ్యం గణనీయంగా ఉండనుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 9 అసెంబ్లీ సెగ్మెంట్లతోపాటు నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోకి వచ్చే కోరుట్ల, జగిత్యాల సెగ్మెంట్లలో సైతం అత్యధికంగా మహిళా ఓటర్లే ఉండడం విశేషం. కాగా నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాజకీయ వర్గాలతోపాటు ఇతర అన్ని వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ముఖ్యంగా నిజామాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్య భారీగా ఉన్న నేపథ్యంలో డీలిమిటేషన్‌లో నగరాన్ని ఏవిధంగా విభజిస్తారనే దానిపై ప్రతిఒక్కరిలో ఆసక్తి నెలకొంది. ఉత్తర దక్షిణంగా విభజిస్తారా, తూర్పు పడమరగా విభజిస్తారా అనే విషయమై చర్చ జరుగుతోంది. ఏఏ మండలాలు ఏఏ నియోజకవర్గాల్లోకి మారతాయోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

సన్నబియ్యం పంపిణీలో టాప్

- వందశాతం పంపిణీ పూర్తయిన జిల్లాగా కామారెడ్డి
- వేగవంతంగా పూర్తయిన ప్రక్రియ

కామారెడ్డి క్రైం: సన్నబియ్యం పంపిణీలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. వేగవంతంగా వంద శాతం బియ్యం పంపిణీ పూర్తయ్యింది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఒకేసారి మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని పంపిణీ చేపట్టారు. దుకాణాలకు కార్డుదారులు ఒక్కసారిగా రావడం, కనీసం మూడు సార్లు వేలిముద్రలు తీసుకోవడం, సాంకేతిక సమస్యలు వంటివి మొదట్లో ఇబ్బందులకు గురిచేశాయి. అయినప్పటికీ రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లాలో పంపిణీ ప్రక్రియ ముందుగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

17,505 మెట్రిక్ టన్నులు..
జిల్లాలో 578 రేషన్ దుకాణాలు, వాటి పరిధిలో ప్రతి నెలా 5,835 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ ఉంటుంది. కానీ నెలలో మాత్రం మూడు నెలలకు సంబంధించి 17,505 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఒకే సారి కేటాయించారు. గత నెలాఖరు నుంచే ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి బియ్యం సకాలంలో రేషన్ దుకాణాలకు చేరేలా సివిల్ సప్లయ్ అధికారులు చర్యలు చేపట్టారు.

19 రోజుల్లోనే..

ఈ నెల ప్రారంభంలోనే రేషన్ పంపిణీ మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వడం.. సన్నబియ్యం కావడంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు తరలివచ్చారు. దీంతో దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఎక్కువసార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి ఉండటంతో ఒక్కో లబ్ధిదారుడికి బియ్యం పంపిణీ చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంది. కొందరు డీలర్లు మొదట్లో ఒక్కోరోజు రాత్రి 11 గంటల వరకు బియ్యం పంపిణీ చేసిన సందర్భాలు ఉన్నాయి. అయినా కూడా 19 రోజుల్లోనే రేషన్ డీలర్లు, అధికారులు కలిసి సన్నబియ్యం పంపిణీ ప్రక్రియను పూర్తి చేశారు.

పంపిణీ పూర్తయ్యింది



జిల్లాలో మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ పూర్తయ్యింది. ఈ నెల 19 నాటికి లబ్ధిదారులందరికీ సన్నబియ్యం అందించాం. దీంతో పంపిణీ ప్రక్రియ త్వరగా చేపట్టడంలో మన జిల్లానే ముందుంది. ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.

– రాజేందర్, డీఎం, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్, కామారెడ్డి

అక్కాపూర్‌లో కబ్జా భూమి స్వాధీనం



అధికారులతో మాట్లాడుతున్న అక్కాపూర్ గ్రామస్తులు

మాచారెడ్డి: మండలంలోని అక్కాపూర్‌లో స్థానికులు సాగు చేస్తున్న ఫారెస్ట్ భూమిని గురువారం అటవీ శాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. కామారెడ్డి, మాచారెడ్డి రేంజ్ పరిధిలోని అధికారులతో పాటు మాచారెడ్డి ఎస్సై అనిల్, పోలీస్ సిబ్బందితో వెళ్లి జేసీబీలు, ట్రాక్టర్లతో పొలం మడులను చదును చేశారు. ఈ సందర్భంగా మాచారెడ్డి ఎఫ్ఆర్వో దివ్య మాట్లాడుతూ..రైతులు సాగు చేస్తున్న భూమి మొత్తం అటవీ భూమేనని అన్నారు. గతంలో కూడా నాటిన మొక్కలను ధ్వంసం చేశామని, అప్పుడు కూడా రైతులపై కేసులు పెట్టామన్నారు. అక్కడ సాగు చేస్తున్న రైతులకు నోటీసులు జారీ చేసిన తర్వాతనే అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. 40 ఏళ్లుగా ఆ భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, అధికారులు తమపై అనవసరంగా దౌర్జన్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రైతులు కామారెడ్డి డీఎఫ్‌వో నిఖితకు తమ భూములను అప్పగించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎఫ్‌డీవో రామకృష్ణ, కామారెడ్డి ఎఫ్ఆర్వో రమేశ్, సిబ్బంది ఉన్నారు.

యూరియా కోసం పడిగాపులు



గురువారం ఉదయం రైతు వేదిక వద్ద క్యూలో నిల్చున్న రైతులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): యూరియా ఎరువుల కోసం రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మృగశిరకార్తెకు ముందే పెద్ద వర్షాలు కురవడంతో రైతులు మొక్కజొన్న, పత్తి, సోయా విత్తనాలు వేశారు. విత్తనాలు మొలకెత్తడంతో యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. తాడ్వాయి సింగిల్‌విండోకు యూరియా వచ్చిందని తెలియడంతో గురువారం ఉదయమే రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోదాము వద్ద రాళ్లు, చెప్పులు, వాటర్ బాటిళ్లు తదితర వస్తువులను క్యూలో ఉంచారు. అలాగే రైతు వేదిక కార్యాలయం వద్ద క్యూలో నిల్చున్నారు. రైతులందరికీ సరిపడా బస్తాలు వచ్చిన తరువాతే ఇస్తామని అధికారులు చెప్పడంతో వెళ్లిపోయారు. మరో లారీ వచ్చినట్లు తెలియడంతో రాత్రి వేళ మళ్లీ తరలివచ్చారు. దుప్పట్లు వెంట తీసుకువచ్చి సింగిల్ విండో ఎదుటే పలువురు రైతులు పడుకున్నారు. సరిపడా ఎరువులు తెప్పించాలని రైతులు డిమాండ్ చేశారు.



గురువారం రాత్రి సింగిల్‌విండో ముందు కూర్చున్న రైతులు

ఫోన్‌ల రికవరీలో జిల్లా ముందంజ

- స్పెషల్ డ్రైవ్ ద్వారా 110 సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డి క్రైం: సెల్‌ఫోన్‌ల రికవరీలో రాష్ట్రంలోని కమిషనరేట్‌లను మినహాయించి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని ఎస్పీ రాజేశ్ చంద్ర అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు ఆందోళనకు గురి కావొద్దని, సీఈఐఆర్ విధానంలో రికవరీ చేసే అవకాశం ఉందని తెలిపారు. వారం రోజులుగా జిల్లాలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో పోగొట్టుకున్న, చోరీకి గురైన 110 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామని, వాటి విలువ రూ.16 లక్షల వరకు ఉంటుందని వివరించారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 4 వేల వరకు సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామన్నారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు అశ్రద్ధ చేయకుండా తమకు సమాచారం ఇవ్వడంతోపాటు భద్రతా కారణాల దృష్ట్యా వెంటనే సిమ్ కార్డును బ్లాక్ చేయించాలని సూచించారు. ఆలస్యం చేస్తే వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలిగే అవకాశం ఉంటుందన్నారు. ఫోన్‌ల రికవరీలో ప్రతిభ కనబర్చిన ప్రత్యేక బృందం సభ్యులను అభినందించారు. ఫోన్‌లు పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేసిన వారు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఆర్ఎస్సై బాల్‌రాజు (87126 86114)ను సంప్రదించి తీసుకువెళ్లాలని సూచించారు. ఏఎస్పీ నరసింహారెడ్డి, ఏఆర్ డీఎస్పీ యాకూబ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

ఆర్టీసీ ప్రయాణికులపై టోల్ భారం

- నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు రూ.30 పెంపు
- ఒక్కో టోల్ గేట్‌కు రూ.10 చొప్పున వసూలు
- నిలదీస్తున్న ప్రయాణికులు

ఖలీల్‌వాడి: ఆర్టీసీ ప్రయాణికులపై టోల్‌భారం పడింది. నిజామాబాద్ రీజియన్ పరిధిలోని ఆరు డిపోల్లోని ప్రయాణికులకు రూ.20 నుంచి రూ. 30 వరకు టికెట్ ధరలు పెరిగాయి. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) టోల్ ట్యాక్స్ పెంచింది. దీంతో తెలంగాణ ఆర్టీసీ టోల్‌భారం పడకుండా ఉండేందుకు టికెట్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఒక్కో టోల్ గేటుకు రూ.10 చొప్పున భారం పడుతుంది. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఇందల్వాయి, భిక్కనూర్, తుప్రాన్ టోల్‌ప్లాజాలు వస్తాయి. ఈ ప్లాజాను బట్టి ఇక్కడి నుంచి ప్రయాణించే ప్రయాణికులకు టికెట్ ధర రూ.30 పెరిగింది. కామారెడ్డి, బాన్సువాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి రెండు టోల్ ప్లాజాలు ఉండగా, ఇక్కడి ప్రయాణికుల టికెట్ ధర రూ.20 పెరుగుతుంది. గతంలో ప్రయాణికులకు చిల్లర ఇవ్వడానికి కండక్టర్లుకు ఇబ్బందులు ఏర్పడటంతో టికెట్ ధరలను రౌండ్ ఫిగర్ చేశారు. దీంతో అప్పుడు రేట్లు పెరిగాయి. మళ్లీ టోల్‌ప్లాజా రేట్లను ఎన్‌హెచ్‌ఏఐ పెంచడంతో ప్రయాణికులకు అవగాహన కల్పించకుండానే ధరలను పెంచేశారు. ఒకేసారి ధరలు పెంచడంతో ప్రయాణికులు నిలదీస్తున్నారు. గతంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు ఏసీ బస్సుల్లో టికెట్ ధర రూ.430 ఉండగా, ప్రస్తుతం రూ. 460కి పెరిగింది. ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రికల్ బస్సుల్లో రూ. 360 టికెట్ ధర ఉంటే ప్రస్తుతం రూ. 390 ధర నిర్ణయించారు. ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా రేషలైజేషన్ పేరిట అన్ని రకాల ఎక్స్‌ప్రెస్‌లపై రూ.10 ధరలు పెంచింది.

మహాలక్ష్మి పథకంతో ఎక్స్‌ప్రెస్ బస్సులలో పురుషులకు సీట్లు దొరకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా తాజాగా టికెట్ ధరలను పెంచడంతో భారం పడుతోంది. టికెట్ ధరల పెంపు విషయమై ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్నను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

పరుగుతో ఆరోగ్యం మెరుగు

- ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



కామారెడ్డి అర్బన్: మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యానికి నడక, పరుగు ఎంతో ఉపయోగపడుతుందని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన మద్ది చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో 39వ ఒలింపిక్ డే రన్‌ను గురువారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఇందిరా గాంధీ స్టేడియం వరకు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఆర్డీవో వీణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ కైలాస్ శ్రీనివాస్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో ఒలింపిక్ డే రన్ కన్వీనర్, కో-కన్వీనర్లు నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి, ఆర్ వెంకటేశ్వర్‌గౌడ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డీఈఓ రాజు, యువజన, క్రీడల జిల్లా అధికారి జగన్నాథన్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్- 2025పై జిల్లాస్థాయి అవగాహనా సమావేశాన్ని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా గ్రామాలు, పట్టణాలలో క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, మురికి కాలువలు శుభ్రం చేయాలన్నారు. ప్రతి మంగళ, శుక్ర వారాల్లో డ్రైడే నిర్వహించాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలని, తాగునీటి పైప్‌లైన్‌లకు లీకేజీలు ఏర్పడకుండా జాగ్రత్త పడాలన్నారు. గతేడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకొని హైరిస్క్ ప్రాంతాలైన కామారెడ్డి అర్బన్, దేవునిపల్లి, రామారెడ్డి మండలం అన్నారంతోపాటు లింగంపేట్, మాచారెడ్డి, నిజాంసాగర్ ప్రాంతాల్లో ముందస్తుగా డెంగీ నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ నివారణపై జిల్లా, పీహెచ్‌సీ స్థాయిల్లో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను నియమించడంతోపాటు ప్రభుత్వ ఆస్పత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధిహామీ..
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా చేయించాలని, క్రమం తప్పకుండా పనులను పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ సంగ్వాన్ ఆదేశించారు. గరిష్ఠంగా కూలీ వచ్చేలా ఉపాధిహామీ పనులు కల్పించాలని అన్నారు. భూగర్భ జలాల పెంపునకు సంబంధించి బోరుబావుల వద్ద ఇంకుడు గుంతలు, వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలన్నారు. ప్రతి మండలంలో ఒక సామాజిక మరుగుదొడ్ల కాంప్లెక్స్ నిర్మించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు సకాలంలో మంజూరు చేయాలన్నారు. పాఠశాలల విద్యార్థులకు రెండో విడత యూనిఫామ్‌ల తయారీని ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో జిల్లాలో 3 పెట్రోల్ బంకుల ఏర్పాటు చర్యలను వేగవంతం చేయాలన్నారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, డీఆర్డీవో సురేందర్, డీపీవో మురళి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యూపీఎస్సీ పరీక్షల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ పరీక్షల (ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ) హైదరాబాద్ రాజేంద్రనగర్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో గురుకుల పద్ధతిలో సమగ్ర శిక్షణ కోసం అర్హులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించరాదని, వచ్చే నెల 4లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.వివరాలకు 6281 7 66534 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కో–ఆర్డినేటర్ శంకరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఆగష్టు 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు జాక్ట్ సిబ్బంది సారికను సంప్రదించాలని అన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల కోసం..

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించడానికి ఈ నెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి ఎ.ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు ఈనెల 18న ముగిసినందున ప్రభుత్వం 27 వరకు పొడిగించిందని, దరఖాస్తు చేసుకోని వారు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దోమకొండ: లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. గురువారం వారు మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అధికారులతో కలిసి ఆర్డర్ కాపీలను అందజేసి మాట్లాడారు. ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, జీపీ కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

భిక్కనూరు: తెలంగాణ విశ్వవిద్యాలయాల డాక్టరేట్ అసోసియేషన్ అధ్యక్షులు సంతోష్ గౌడ్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని తెలంగాణ విశ్వవిద్యాలయం సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్ ఆకాంక్షించారు. సంతోష్ గౌడ్ ఇటీవల పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పూర్తి చేసి గ్రంథాలయాలను సమర్పించారు .ఈ సందర్భంగా ఆయనను సౌత్ క్యాంపస్‌లో ఘనంగా అభినందించారు. అధ్యాపకులు యాలాద్రి, నారాయణ గుప్తా, నరసయ్య, కనకయ్య ఉన్నారు.

ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలి



భిక్కనూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర కాంత్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో 39వ ఒలింపిక్ రన్‌ను ఆయన ప్రారంభించారు. అక్కడి నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల ఇందిరా గాంధీ స్టేడియం వరకు రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులలో క్రీడల ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. జిల్లా అదనపు ఎస్పీ చైతన్యారెడ్డి, ఆర్డీవో వీణ, డీఈవో రాజు, తదితరులు పాల్గొన్నారు.

జూలై 7న డప్పుల మోత

భిక్కనూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జూలై 7న అన్ని గ్రామాల్లో డప్పుల మోత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కామారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకులు సామ్యేల్ మాదిగ తెలిపారు. గురువారం ఆయన భిక్కనూరులో ఎమ్మార్పీఎస్ నేతలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్ ప్రజా సమస్యలపై కూడా పోరాటం చేసిందని గుర్తు చేశారు. నేతలు కొత్వాళ్ల యాదగిరి, శ్యామర్తి రాజు, నడిపోల్ల రామస్వామి, వరుణ్, పుల్లురి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్ష..!

- వర్షాకాలంలో అధికంగా విద్యుత్ ప్రమాదాలు
- చిన్న పొరపాటుతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న రైతన్నలు
- అవగాహన లోపంతో గాల్లో కలుస్తున్న ప్రాణాలు



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు



బీబీపేట: వర్షాకాలం వచ్చిందంటే చాలు విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. వర్షాకాలంలో ప్రజలు, రైతులు విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండకపోవడంతో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇళ్లు, పంట చేల వద్ద విద్యుత్ వినియోగంలో ఎక్కువగా జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించినప్పటికీ చిన్న చిన్న పొరపాట్ల వల్ల ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్‌లో విద్యుత్‌తో బోరు బావులు, వాగుల వద్ద విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి పంటలు సాగు చేస్తారు. ఈ సమయంలో మోటార్ల వినియోగంలో రైతులు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదం బారిన పడకుండా ఉండటానికి అవకాశం ఉంటుంది.

పొలాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- పంట పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు చిన్న, చిన్న మరమ్మతులు చేస్తుంటారు. దీంతో ప్రమాదాలు జరుగుతుంటాయి.
- ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోకపోతే విద్యుత్ సరఫరా అయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాల్సి వస్తే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలి.
- ఇక విద్యుత్ మోటార్లు వాడే సమయంలో జాగ్రత్తలు అవసరం. ఒక ఫేజ్ కాలితే మోటార్ మొత్తానికి విద్యుత్ ప్రవహిస్తుంది. కాబట్టి ఆ సమయంలో మోటారుకు తగలకూడదు. మోటార్ పని చేయని సమయాల్లో చేతితో దానిని తాకకూడదు.
- టెస్టర్ ఉపయోగించి మాత్రమే మోటార్‌ను పరీక్షించాలి. ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. మోటార్‌పై రేకును అమర్చాలి. వర్షం పడితే తడవకుండా కాపాడుకోవాలి.
- అంతే కాకుండా పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్టాటర్ బాక్స్‌ల చుట్టూ పిచ్చి మొక్కలు ఉండకుండా చూసుకోవాలి. వర్షాకాలం కాబట్టి వాటి చుట్టున్న మొక్కలులాంటివి ఉండడంతో విద్యుత్ సరఫరా అయి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.
- స్టార్టర్లకు రక్షణగా ఉండేందుకు కవర్లను ఉంచుకోవాలి. తెగిన విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలి. సర్వీసు తీగ తెగినప్పుడు గుడ్డ ముక్కతో అతికిస్తారు. ఇది చాలా ప్రమాదకరం. వీలైనంత వరకు తెగని తీగలను మాత్రమే వాడాలి.
- విద్యుత్ మోటార్ల వద్ద కింద పడి ఉంటాయి. వాటిని పట్టించుకోకుండా ఉండకూడదు. తీగ ఎక్కడ చిన్నగా తెగినా నడిచేప్పుడు కాని స్విచ్ ఆన్ చేసే సమయంలో తగిలితే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి.
- బోరుబావుల వద్ద పైపులు పైకి తీసే క్రమంలో పైన విద్యుత్ వైర్లు ఉన్నది గమనించకపోవడంతో ఇప్పటికే చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అలా వైర్లు ఉన్నట్లయితే విద్యుత్ బంద్ చేసిన తర్వాతనే పైపులు తీయాలి.

విద్యుత్ అధికారుల అవగాహన

విద్యుత్ శాఖ అధ్వర్యంలో పొలం బాట కార్యక్రమం పేరిట ప్రతి గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతుల పొలం వద్దకే వెళ్లి రైతులకు విద్యుత్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పిస్తూ పలు సలహాలు ఇస్తున్నారు. అంతే కాకుండా విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు కచ్చితంగా విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలుపుతున్నారు.

జాగ్రత్తలు కచ్చితంగా పాటించాలి



వర్షాకాలంలో ఇళ్లలో విద్యుత్‌తో జాగ్రత్తగా ఉండాలి. తడి చేతులతో విద్యుత్ పరికరాలను స్విచ్‌లను తాకకూడదు. ఇక పంట పొలాల వద్ద రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ బాక్సులు, విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే స్వంతంగా మరమ్మతులు చేయకూడదు. సంబంధిత లైన్‌మన్ లేదా విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.

– సుదర్శన్‌రెడ్డి, ఏడీఈ, దోమకొండ

ఫిర్యాదుదారులతో బాధ్యతగా వ్యవహరించాలి

ఎస్పీ రాజేష్ చంద్ర



జుక్కల్‌లో ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడుతున్న ఎస్పీ

నిజాంసాగర్(జుక్కల్): ఫిర్యాదుదారులతో బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలని ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర సూచించారు. గురువారం వార్షిక తనిఖీలో భాగంగా జుక్కల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించాలని, బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌ని సంప్రదించవచ్చని అన్నారు. నేరాల నివారణే లక్ష్యంగా పని చేయాలని స్థానిక పోలీసులకు సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెడుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నూతన టెక్నాలజీపై పోలీసులు అవగాహన పెంచుకోవాలన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. జుక్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని బ్యాంకులు, మందిరాలు, దేవాలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు, అలారంలు ఏర్పాటు చేయాలని ఎస్సైని ఆదేశించారు. పెండింగ్ కేసులపై రివ్యూ చేశారు. డీఎస్పీ విఠల్ రెడ్డి, బిచ్కుంద సీఐ నరేష్, జుక్కల్ ఎస్సై భువనేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికుల ఐదు పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. గురువారం జీజీహెచ్ ఆస్పత్రిలో కార్మికులకు రెగ్యులర్‌గా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు దశరథ్, ప్రవీణ్, లక్ష్మి, రఫీక్, అర్జున్, తదితరులున్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఎల్లారెడ్డిరూరల్: జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎల్లారెడ్డి మండలం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో రాజులు గురువారం తెలిపారు. క్రీడా పాఠశాలల్లో నిర్వహించిన పలు క్రీడా పోటీలలో 8 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అభిలాష్, వినయ్, అశ్విన్‌లను జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

బహుమతుల అందజేత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం అనసూయ సూచించారు. జప్తిజాన్కంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బడిబాట ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. మాజీ సర్పంచ్ దేశబోయిన సాయిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

శతాధిక వృద్ధురాలు మృతి



దస్లీబాయి (ఫైల్)

మాక్లూర్: మండలంలోని అమ్రాద్ తండాలో శతాధిక వృద్ధురాలు దస్లీబాయి (105) గురువారం మృతి చెందారు. దీంతో తండాలోని పలువురు గిరిజనులు శోకసముద్రంలో మునిగిపోయారు. నాటితరం వృద్ధురాలైన దస్లీబాయి గిరిజన తెగ సంప్రదాయాలను విస్మరించకుండా కొనసాగించటంలో పట్టుదలతో ఉండేవారని తండావాసులు విషాదవదనంతో తెలిపారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులు గిరిజన సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆమె కుమారులు, మనమలు, మునిమనుమళ్లు, మనుమరాళ్లు కడసారి వీడ్కోలు పలికారు. దస్లీబాయి భర్త బలరామ్‌నాయక్‌రెండు దశబ్దాల క్రితమే మృతి చెందాడు.

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్ మెయిన్‌గేట్ వద్ద మురికికాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. ఈనెల 17న సాయంత్రం రైల్వే స్టేషన్ మెయిన్ గేట్ పక్కన గల మురికి నాలాలో ఒక గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకొని అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అతడిని పరిశీలించగా మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50నుంచి55ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. మృతుడు తెలుపు రంగు, బ్లూకలర్ షర్ట్, గోధుమ కలర్ ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. ఎవరికైనా అతడి సమాచారం తెలిస్తే ఎస్‌హెచ్‌వో ఫోన్ నెంబర్ 8712659714కు సమాచారం అందించాలన్నారు.

ముప్కాల్ మండలంలో..



బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామ ఊర చెరువులో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. ముప్కాల్ ఎస్సై రజినీ కాంత్ తెలిపిన వివరాలు ఇలా.. స్థానికులు చెరువులో మృతదేహం ఉన్నట్లు సమాచారమివ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటాయన్నారు. అతడు బూడిద కలర్ ప్యాంట్, ఆకుపచ్చ రంగు షర్టు వేసుకున్నాడన్నారు. కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

కారు బోల్తా: ముగ్గురికి గాయాలు




వర్ని: మండలంలోని కొనిపూర్ క్యాంప్ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్‌తోపాటు పట్నం కుమార్, సాలె వెంకటి ముగ్గురు కలిసి కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో కొనిపూర్ క్యాంప్ శివారులో వారి కారు అదుపుతప్పి ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టి, పొలాల్లో బోల్తా పడింది. ఈ ఘటనలో కుమార్, వెంకటికి కాళ్లు విరగగా సురేష్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. వర్ని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి



రాజంపేట: మండల కేంద్రంలో ఓ బాలుడిపై వీధి కుక్కల దాడిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. రాజంపేటలోని గడ్డమీది మహేష్, సంతోషిల కుమారుడు నిధ్విత్ (నాని)(6) బుధవారం సాయంత్రం ట్యూషన్ వెళ్లేందుకు ఇంటి నుంచి బయటకు రాగా కొద్ది దూరం వెళ్లగానే వీధి కుక్కల గుంపు దాడికి పాల్పడ్డాయి. దీన్ని గమనించిన తల్లి సంతోషి కుక్కలను తరిమికొట్టేందుకు ప్రయత్నించగా ఆమె పైకి కూడా దాడి చేయడానికి యత్నించాయి. అప్పటికే పలువురు కాలనీవాసులు అక్కడికి చేరుకుని కుక్కలను తరిమికొట్టారు. అనంతరం బాలుడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో వీధి కుక్కల నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి ఆత్మహత్య



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్, ఎస్సై తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్‌రైల్వే స్టేషన్‌సమీపంలోని కిలోమీటర్ నెంబర్ 460/10 వద్ద ఒక గుర్తు తెలియని వృద్ధురాలు జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి వయస్సు సుమారు 60ఏళ్లు ఉంటాయని తెలిపారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదన్నారు. ఎవరికైనా ఆమె వివరాలు తెలిస్తే రైల్వే ఎస్సై 87126 58591కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

బోధన్: ఎడపల్లి మండలం జాన్కంపేట గ్రామంలో ఈనెల 13న పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడిని గురువారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు.

మహిళను తోసివేసిన వ్యక్తిపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని బురడిగల్లీలో ఎదురెదురుగా ఉన్న మహిళలు గొడవ పడినట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ శుక్రవారం తెలిపారు. ఎదురెదురుగా ఉండే తల్లికూతుళ్లతో మరో మహిళ గొడవ పడినట్లు తెలిపారు. సదరు మహిళ భర్త వచ్చి తల్లీకూతుళ్లను నెట్టివేయడంతో వారికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి



లింగంపేట: మండలంలోని అయిలాపూర్ గ్రామంలో బీరప్ప అనే రైతుకు చెందిన ఎద్దు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. గ్రామ శివారులోని పొలంలో గురువారం మేత కోసం వెళ్లిన ఎద్దుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ. 70వేలు వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. ఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో అధికారులు పరిశీలించారు. అధికారులు స్పందించి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఆర్మూర్ నుంచి తిరుమలకు వెళ్లే జెండా

మీకు తెలుసా?



ఆర్మూర్ పట్టణంలోని జెండా బాలాజీ మందిరంలో జెండాను ప్రతిష్ఠిస్తున్న భక్తులు (ఫైల్)

ఆర్మూర్: పట్టణంలోని వేంకటేశ్వర (జెండా బాలాజీ)ఆలయం నుంచి తిరుమల వరకు పాదయాత్రగా తీసుకువెళ్లే జెండా పండుగను శ్రావణ మాసంలో ఆనవాయితీగా నిర్వహిస్తారు.

- 200 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న జెండా పండుగను తిరుపతికి వెళ్లలేని భక్తుల కోసం నిజాం నవాబుల కాలంలో అంకాపూర్ దొర గడ్డం వెంకట భూమారెడ్డి హయాంలో ప్రారంభించినట్లు ప్రతీతి.
- నిజాంలు జెండా పండుగ నిర్వహణకు ఎన్నో అడ్డంకులు కల్పించే వారని పెద్దలు చెబుతుంటారు. వాటిని అధిగమిస్తూ నేటికీ ఈ పండుగను, జాతరను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు.
- జెండా జాతర కోసం తొమ్మిది రోజుల ముందు జెండా కర్రకు 20 మీటర్ల పట్టు బట్టలను ఆర్మూర్‌లో నేసి జెండాపై ఉంచి దానిపై ఓం గుర్తును పెడతారు.
- శ్రావణ శుద్ధ తదియ రోజున జెండాను ప్రతిష్ఠించిన అనంతరం తొమ్మిది రోజుల పాటు జెండాకు పూజలు నిర్వహిస్తారు.
- అనంతరం ఆర్మూర్‌లోని జెండా మందిరం నుంచి ఊరేగింపుగా జెండాను తీసుకెళ్లి అంకాపూర్ గ్రామస్తులకు అప్పగిస్తారు.
- అంకాపూర్‌లో శ్రావణ శుద్ధ ఏకాదశి నుంచి భాద్రపద శుద్ధ చవితి వరకు 22 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.
- వినాయక చవితి తెల్లారి అంకాపూర్ గ్రామస్తులు జెండాను జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ వరకు తీసుకెళ్తారు. ఈ జెండాను గతంలో ముడుపులు కట్టి గ్రామంలో ఊరేగిస్తూ కాలి నడకన తిరుమల తిరుపతిలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేర్చేవారు. ప్రస్తుతం వాహనంలో తరలిస్తున్నారు.

లంచం అడిగితే ఏసీబీని సంప్రదించండి

టోల్ ఫ్రీ నెంబర్	1064	ఏసీబీ సీఐలు	9154388951, 9154388953, 9154388923
వాట్సాప్ నెంబర్	9440446106	సోషల్ మీడియా	facebook (Telanganna acb),x@Telanganna acb
ఏసీబీ డీఎస్పీ	9154388950		

వైద్యాధికారిపై దాడికి నిరసనగా ధర్నా



రామారెడ్డిలో ధర్నా చేస్తున్న వైద్య సిబ్బంది

రామారెడ్డి: కామారెడ్డిలోని కల్కినగర్లో నివాసం ఉంటున్న రామారెడ్డి ప్రభుత్వ వైద్యాధికారి సురేష్ ఇంటికి ఈ నెల 17న రాత్రి వెళ్లి దాడి చేసిన దేవునిపల్లి పీహెచ్‌సీ డాటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో) రాజును సస్పెండ్ చేయాలని వైద్య సిబ్బంది గురువారం రామారెడ్డిలో ధర్నాకు దిగారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. దాడిలో రాజుతో పాటు జుక్కల్ ప్రభుత్వ ఆస్పత్రి జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే సుభాష్ ఇద్దరూ కలిసి పాల్గొన్నారని, అసభ్యకర పదజాలంతో తిడుతూ దాడి చేసినట్లు తెలిపారు. దాడి చేసిన సమయంలో 100కు డయల్ చేస్తే ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు స్పందించలేదని ఆరోపించారు. ఈ దాడిలో డాక్టర్ సురేష్‌కు స్వల్పంగా గాయాలయ్యాయని చెప్పారు. జిల్లా వైద్యాధికారులు, పోలీస్ అధికారులు, కలెక్టర్ స్పందించి దాడి చేసిన ఇద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుండా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తామన్నారు. ఈ దాడిని రామారెడ్డి , ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల సిబ్బంది ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి



రాస్తారోకో చేస్తున్న మృతుల బంధువులు



నిలిచిపోయిన వాహనాలు

ఎల్లారెడ్డి: మండలంలోని మల్లయ్యపల్లిగేట్ వద్ద నిర్మిస్తున్న పోచారం కాలువ బ్రిడ్జి గుంతలో కారు పడిన ప్రమాదంలో మృతికి కారణమైన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలను తీసుకోవాలని మృతుల బంధువులు డిమాండ్ చేశారు. గురువారం బ్రిడ్జి నిర్మాణ ప్రదేశంలో రాస్తారోకో చేశారు. కారు ప్రమాదంలో లునావత్ పీర్యా, కెతావత్ పీర్యాలు మృతి చెందడంతో బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే కారు గుంతలో పడి ప్రమాదానికి గురైందని వారు ఆరోపించారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో ఎస్సై మహేష్, సీఐ రవీందర్‌నాయక్‌లు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సముదాయించడంతో వారు రాస్తారోకో విరమించారు.

వ్యాపారంలో పెట్టుబడి పేరుతో బురిడీ

నిందితుడి అరెస్టు

ఖలీల్‌వాడి: వ్యాపారంలో పెట్టుబడి పెడితే రూ. లక్షకు 20 శాతం లాభం వస్తుందని మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావు తెలిపారు. నగరంలోని అహ్మద్ పురా కాలనీకి చెందిన మొహమ్మద్ అబ్దుల్ ఫరాజ్ సమీర్ (37)కు ఏడాది క్రితం ఆటోనగర్‌కు చెందిన ముక్తార్(45)తో పరిచయం ఏర్పడింది. ముక్తార్ ఎస్ఎన్ ఆటో మొబైల్ డీలర్ షాపు నిర్వహిస్తుండగా రూ.3లక్షల పెట్టుబడి పెట్టడానికి అతడి వద్ద తీసుకున్నాడు. ప్రతీ లక్షకు రూ. 20వేలు లాభంగా వస్తుందని హామీ ఇచ్చి, నెలకు రూ. 60వేలు లాభం ఇస్తానని చెప్పాడు. ఇదే తరహాలో ముక్తార్ పలువురు వ్యక్తుల నుంచి డబ్బులు సేకరించారు. మొదట్లో పలువురికి 20శాతం నుంచి 40శాతం వరకు లాభంగా ఇవ్వగా, కొన్ని రోజులకు వ్యాపారం మూసివేసి, బాధితులకు డబ్బులు ఇవ్వకుండా పారిపోయాడు. సుమారు 38 మంది బాధితుల నుంచి రూ.కోటి– కోటిన్నర వరకు అతడు డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఈక్రమంలో పోలీసులు ముక్తార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. మిగతా బాధితులను గుర్తించేందు, మోసపోయిన ఖచ్చితమైన మొత్తాన్ని నిర్ధారించేందుకు మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి అదృశ్యం



మేఘావత్ మోహన్ ,లక్ష్మి,శిరీష

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన మేఘావత్ మోహన్, భార్య లక్ష్మి, కూతురు శిరీషలు ఈనెల 14న తిరుపతికి దైవ దర్శనం నిమిత్తం నిజామాబాద్ రైల్వేస్టేషన్ నుంచి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు ఇంటికి చేరుకోలేదు. దీంతో వారి కుటుంబ సభ్యుడు రవీందర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారి సమాచారం తెలిస్తే 87126 59782, 87126 59874 నంబర్లకు అందించాలని సూచించారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మోర్తాడ్(బాల్కొండ): గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. మోర్తాడ్ నుంచి దోన్‌పాల్ వెళ్లే మార్గంలో విశ్వసనీయ సమాచారంతో మోర్తాడ్ ఎస్సై విక్రమ్ తనిఖీలు చేపట్టారు. మోర్తాడ్‌కు చెందిన పిట్టల సంతోష్, వడ్యాట్‌లో నివాసం ఉంటున్న నెల్లూర్ జిల్లాకు చెందిన బకీర్ గిరిబాబులు గంజాయి రవాణా చేస్తున్నట్లు సందేహం వచ్చి పోలీసులు వారిని తనిఖీ చేశారు. వారి వద్ద 10 చిన్న ప్యాకెట్లలో రూ.5వేలు విలువ చేసే 100 గ్రాముల గంజాయి పట్టుకున్నారు. మరో కవర్‌లో రూ.7,500ల విలువ చేసే 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లు, ట్రాలీ ఆటోను, రూ.8,600ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సైలు విక్రమ్, అనిల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

నకిలీ ట్రాన్స్‌జెండర్స్ అరెస్టు

బోధన్ టౌన్ (బోధన్): పట్టణంలోని విద్యా సంస్థలను నకిలీ ట్రాన్స్‌జెండర్స్ వేధించడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. మెదక్ జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులు హిజ్రాలుగా వేషం వేసుకొని పట్టణంలోని రాకాసిపేటలో గల క్రిసెంట్ పబ్లిక్ స్కూల్‌కి వెళ్లి డబ్బులు కావాలని ప్రిన్సిపాల్ వేధించారు. అలాగే ఇతర ప్రయివేటు పాఠశాలల్లోనూ డబ్బుల కోసం వేధించారన్నారు. దీంతో క్రిసెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ మీర్ జావిద్ అలీ ఫిర్యాదు చేయగా, ఈమేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.